అక్షరాలతో

# కరచాలనం

కవిత్వం

శ్రీమతి ములుగు లక్ష్మీ మైథిలి



ధర్మకేతనం సాహిత్య కళాపీఠం
హైదరాబాద్

# శ్రీ శారదాంబ నమోస్తుతే

చల్లని తల్లి వీణా పాణి
కల్పకవల్లీ పుస్తకధారిణి
మృదుపద సుమధుర భాషిణి
ధవళకాంతుల అలంకార భూషిణి
చిరునగవుల సుహాసిని

పలుకుతేనెల తల్లి పలికించవమ్మ
తేట తెలుగు మాట శర్వాణి
నీ కటాక్ష వీక్షణం లేనిదే
విద్య రాదు కదమ్మా...

సర్వకాల సర్వావస్థల యందు
సర్వజీవుల యందు జ్ఞానరూపిణివై
అనునిత్యం మా నాల్కలందు
జపించే మంత్రరాజమై
వేదశాస్త్రమై..సద్గంధ్రమై..
సాహితీ సంద్రమై ..
చతురోక్తుల చమత్కార మిళితమై
మహనీయుల మహితాత్ముల
కావ్యమాలికలై నిలిచె గీర్వాణి

నీ కృపాకటాక్షముతో
సకలశాస్త్ర పారంగుతులు
జ్ఞానస్వరూపులే...సకల జనులు
ప్రతి మదిలో జ్ఞానదీపమై
వెలిగే  వాగ్దేవి..
సకల కళలలో కొలువైన తల్లి
వాణీ...సరస్వతీ
శ్రీశారదాంబ నమోస్తుతే!

# కరచాలనం

వెదురుకెన్ని
గాయాలైనా
రాగం
పలికించక మానదు

దేవుని పూజకు
పూచే కొమ్మకు
రెమ్మ నొచ్చుకుంటుందని
పూలను
తుంచక తప్పదు

వేదన కలిగిందని
మనసు
జ్వలించక మానదు

మోవిపై
చిరునవ్వు
పూయాలంటే
అక్షర కరచాలనం తప్పదు.

**– విశాలాక్షి ఇంటింటి సాహిత్య మాస పత్రిక (నవంబర్ 2017)**

# ప్రయాణం

అప్పుడప్పుడు
నాలోకి...నేను
ప్రయాణం చేస్తుంటాను
ఒక్కోసారి
స్మృతి పథం లో
మెదిలే
ఊహలకు
కార్యరూపం ఇస్తాను
ఇంకోసారి
నన్ను నేను
తరిచి చూసుకుంటూ
ముందడుగు వేస్తాను
వెళ్లి పోయిన
జ్ఞాపకాలు
గుండెను తడిమేస్తుంటే
ఓదార్పు లేపనాన్ని
గుండె గాయానికి
అద్దుకుంటాను
తప్పిపోయిన
బాల్యం కోసం
జీవనపథంలో
ఎదురుపడ్డ
వాస్తవాలను
ఆహ్వానిస్తాను
నేనింకా
మిగిలి ఉన్నానా
అనుకుంటూ
అప్పుడప్పుడు
నాలోకి నేను
ప్రయాణం చేస్తుంటాను..!

**– నవతెలంగాణ సోపతి, అక్టోబర్ 22–2018**

# చల్లని చూపులు

కనురెప్పల మాటున
నిదురమ్మను రానీయక
నా కంట కన్నీరు రానివ్వక
కళ్ళలో పెట్టుకుని చూసుకునే అమ్మ
ఆమె  కళ్ళ వాకిళ్ళమాటున
ఉబికే సంద్రం ఎదురీది
నా నవ్వులో ముత్యాలు ఏరుకొనేది
అమ్మ చేయిపట్టి నడిపించింది
చెవిపట్టి విద్య బుద్దులు నేర్పింది
అపజయాలలో వెన్నుతట్టి ప్రోత్సాహించేది..
నేడు అమ్మ లేని లోగిలి
వసంతం లేని వనంలా..
దేవత లేని కోవెలలా ఉంది
ఆ మందిరం లో అణువణువునా
అమ్మ లాలనే ప్రతిధ్వనిస్తోంది
అమ్మ చెప్పే కథలు..జోలపాటలు
ఆ తలుపుల తలపులలో
నిండి నిమిడీకృతమైనాయి
తన జీవన మజిలీ లో
ఎన్నో కడగండ్లు చవిచూసి
మరెన్నో అనుభవసారం రంగరించి
జీవన వేదం నేర్పింది
అంత్యదశలో..తన కళ్ళను
మరొకరికి దానం చేసిన త్యాగమూర్తి
ఆ చల్లని కంటిచూపులు
పొందిన వారు ధన్యులు
నేత్రదానం చేసిన అమ్మ
మానవత్వానికి చిరునామా
సృష్టి కి మరో సృష్టి అమ్మ
అర్ధనిమీలితనేత్రాలతో
ఇప్పటికీ..నన్ను చూస్తూనే ఉంది..

**– మా అమ్మ చనిపోతూ నేత్రదానం చేసిన సందర్భంలో రాసిన కవిత**

# నాన్న స్మృతి లో

ఆ ఇంటిని చూసినప్పుడల్లా
నా చిన్న నాటి జ్ఞాపకాలు
గుర్తువస్తున్నాయి నాన్న.!

నీ గుండెలపై ఆడించి
నీ భుజాల పై మోసి..
నిదురపుచ్చిన ఆ క్షణాలు
ఇంకా గుర్తు వస్తున్నాయి నాన్న..!

నా చిటికెనవేలు పట్టి నడిపించి
ప్రపంచాన్ని చూపించావు
నువ్వు దిద్దిన అక్షరాలతో
విశ్వవిజేత చేసినందుకు
నీ కంట ఆనందబాష్పాలు
ఇంకా గుర్తు వస్తున్నాయి నాన్న..!

పగలనక రాత్రనక
కష్టించి పనిచేసి
ఇంటిని ఇంట్లో వారందరినీ
ఒంటి స్తంభం లా మోస్తున్నావు
ఆంక్షలైనా,శిక్షలైనా
నా భవిత కోసమేనన్న సంగతి
ఇంకా గుర్తు ఉంది నాన్న..!

గెలిచినా,ఓడినా
వెన్నుతట్టి భరోసా ఇచ్చావు
అందుకే నాన్న నీ స్మృతి మరువలేనిది
నా జీవితగమ్యానికి మార్గదర్శక మైనది..!

(ఫాదర్స్–డే సందర్భంగా)

# గమ్యం

నా జ్ఞాపకాల సంక్రాంతిలో
తమ్ముడు ఎగరేసిన గాలిపటంలో
నా నోట్‌బుక్ పేజీలు చూసి దిగాలుపడ్డా
తమ్ముడి ఆనందం
గాలిపటంతో పోటీ పడుతుంటే
కాదనలేకపోయాను.
ఎవరికీ అందనంత ఎత్తులో
ఎగురుతున్న గాలిపటానికి తెలుసు
పెనుగాలికి పడిపోక తప్పదని
అయినా కొత్త జీవం పోసుకుని
మళ్ళీ పరుగులు పెడుతుంది
వినువీధిలో పక్షులతో పందెం కట్టి
పల్టీలు కొట్టే పతంగం అల్లరి
అంతా ఇంతా కాదు సుమా
ఎన్నో గాలిపటాల మధ్య తనదైన
ముద్ర వేసుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది
తన గెలుపుకు గాలివాటం తోడైతే
ఎల్లలే లేవంటుంది.
ఎగిరే గాలిపటానికి సూత్రధారులెవరైనా
మనకెన్నో సూక్తులు బోధించినట్లు ఉంటుంది
ఎప్పుడూ, ఎవరికీ తలవంచుకుని
బ్రతకవద్దని,
తనలా తలపైకెత్తుకుని నిలబడాలని చెపుతుంది
ఏ కష్టాల కొమ్మకోచిక్కుకున్నా
తిరిగి గమ్యం చేరుకోమంటుంది
గాలి ఉన్నంత వరకే గెలుపుకై
గాలిపటం పోరాడుతుంది
మనిషి కూడా అంతే
ఊపిరి ఉన్నంత వరకు తన జీవనగమనంలో
నలుగురితో పోరాడి గెలవాలి
ఇదే గాలిపటానికి, మనకు ఉన్న సూత్రం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Karachalanam**

* * *